క థా ని క

# ఇద్దరు సుందరాంగులూ: ఒక గుమాస్తా

రంధి సోమరాజు

'తప్పుకో వెధవా' అన్నట్లు హారన్ రౌద్రంగా మోగింది. వెంటనే ఆ కారు జర్రున ఆగినట్లే ఆగి మంటలు గ్రక్కే డ్రయివరు కనుగుడ్లతో ప్రక్కగా తిరిగి, అందులో కూర్చున్న అమ్మాయిల పకపక నవ్వుల హేళనల హాలాహలంతో ముందుకు తుర్రున దూసుకపోయింది.

రమణమూర్తి రోడ్డుమీద అలాగే నిలబడి పోయాడు. అతనికి ఆ కారుమీద, అందులో కూర్చున్న వాళ్ళమీద భగభగ కోపం పుట్టుకొచ్చేసింది. అతని కన్నుల్లో 666 నెంబరుగల ఆ కారు చీకట్లో కొరవిలా ఇంకా నిలిచేఉంది.

"ఇంత పరాకేమిటయ్యా రోడ్డుమీద! బలే వాడివే...డ్రయివరు మంచివాడు కాబట్టి బ్రతికి పోయేవు...ఏం బ్రతకాలని లేదేమిటి..." అని ఏమేమిటో చుట్టూ మూగిన జనం నోటికొచ్చినట్లు వాగేస్తూంటే అతనికి చచ్చినంత సిగ్గేసింది. చచ్చిపోయినంత పనయింది.

పాపం అతను ఎన్నిసార్లో అనుకున్నాడు; కారుక్రింద పడి చచ్చిపోవాలని; కాని ఒక్కసారీ కుదిరిందికాదు. ఈసారి అనుకోలేదు కాని అనుకున్నంత పనీ అయింది.

"పరాకు చిత్తగిస్తున్నారు..." అన్న సిగరెట్ల ఎడ్వర్టయిజుమెంటు, 'టీ త్రాగండి హుషారుగా ఉంటుంది' అన్న టీబోర్డు ప్రకటనలు అతని కళ్ళ ముందు దోమల్లా మూగి గోలగా 'గీ' పెడుతున్నాయి. అతను జేబు తడుముకున్నాడు. ఓ సిగరెట్టుముక్కా దొరకలేదు. ఇక టీ సంగతి చెప్పనే అక్కర్లేదు. పేదగా మూలిగి భుజాలమీద చిరిగిపోయిన చొక్కాను ఓసారి చూసుకున్నాడు.

"నామీద భగవంతుడికి ఇంకా దయ కలుగలేదు. ఈపాటికీ స్వర్గలోకంలో ఎంచక్కా విహరించేవాణ్ణి..." అని తనలో తనే అనుకొని నవ్వుకున్నాడు. పాతికేళ్ళు నిండీ నిండని ఆ యువకుడు ముసలివాడికన్న ముసలివాడిలా జీవితంమీద విరక్తి చెందాడు.

"కనీసం ఆ కారుక్రిందపడి దెబ్బలు తిన్నా బాగుండును. ఎంచక్కా వాళ్లు హాస్పిటల్లో పడేసేవారు. ఏమో దేవుడు మేలు చేస్తే అందులో ఉన్న ఒక అమ్మాయి నామీద జాలిపడి నన్ను పెళ్ళాడుతానని మాటకూడ ఇచ్చేదేమో ..మాట ఇవ్వడమేమిటి...నిజంగా పెళ్ళాడేది కూడాను." అనుకున్నాడు. మురిసిపోయాడు.

కాని వెంటనే, 'ఛీఛీ...ఇలాంటివన్నీ సినిమాల్లోను కథల్లోనూ మాత్రమే జరుగుతాయి... ఈ ప్రపంచంలో ఎప్పుడూ ఇలా జరుగదు. అంతా ఉత్తది అలా జరగడమేమో" అని నిస్పృహగా నవ్వుకున్నాడు. "ఇక నాకు పెళ్ళికాదు. నా జన్మకి ఇక పెళ్ళేమిటి ఇంతే నాపని" అని గుండెల్లో భోరున ఏడ్చాడు. "ఈ తల్లిని, ఈ తమ్ముణ్ణి పోషించి వాళ్ళను బ్రతికించి తను చావవలసిందే... అంతే నా జన్మకింతే...ఛీఛీ...వీళ్ళను విడచిపెట్టి పారిపోయినా బాగుండును. ఎక్కడికైనా వెళ్ళిపోతే ఈ మాత్రపు గుమాస్తా ఉద్యోగమూ ఎక్కడా దొరకక పోతుందేమిటి" అని తనలో తను ఓ మూల్గు మూల్గాడు.

"అయినా ఇంతకన్నా మంచి ఉద్యోగం ఇంకోచోట ఎక్కడ దొరుకుతుందిలే. ఏదో ఆయన కాబట్టి ముప్ఫైరూపాయిలేనా ఇస్తున్నాడు. ఈ వూళ్ళో ఇంకో బట్టలకొట్టుమీద పనిచేసే గుమాస్తాను ఏదీ ఒక్కణ్ణి చూపించు.ఇంతకన్నా ఎక్కువ ఎవడు తెచ్చుకుంటున్నాడు... అంతా పాతికా పరకేగా. ఏమో ఎవడు చెప్పగలడు. మంచి రోజులు రావని ఎందుకనుకోవాలి. ఈ షావుకారు మాత్రం మొదట్లో నా కన్న హీనంగా బతకలేదేమిటి ... నెత్తిమీద గుడ్డల మూటలు పెట్టుకొని ఊరూరా ఇంటింటికీ తిరిగే

వాడటగా, ఇప్పుడంటే లక్షలు గడించాడు కాని! ఎవడికి తెలియదు వీళ్ళకుటుంబం సంగతి! వీళ్ళూ బట్టల కొట్టుల్లో మొదట గుమాస్తాలుగా ఏడ్చిన వాళ్ళేగా! అప్పుడు వీళ్ళకు నెలకు మూడు రూపాయిలు కూడా జీతం ఇచ్చేవారు కాదట. నిజానికి వాళ్ళకన్నా ఇప్పుడు మన పనే బాగుంది. అయితే అప్పుడు ఇంతింతలేసి ధరలు మండుకపోయేవి కాదటలే. బేడయిస్తే పూటకూళ్ళమ్మ కడుపునిండా భోజనం పెట్టేదట. ఎంత మంచివి ఆ రోజులు! ఆ రోజులు మళ్ళీ రావు కాబోలు. ఒకవేళ వస్తే మాత్రం ఏమిటిలే అప్పుడు ఆ బేడకూడా దొరకదేమో! ఏమో ఎవడికి తెలుసు...కొంచెం కష్టంగా ఉంటూన్నా ఏదో దొర్లుకపోతోంది. వీళ్ళనుపట్టుకునే ఇలాకొన్నాళ్లు పాకులాడితే ఎప్పటికైనా ఓమార్గం దొరకకపోతుందేమిటి...కష్టాలు గట్టెక్కక పోతాయేమిటి...ఎవరు చెప్పగలరు ఓ కారులో నేను కూడా షికారు తిరిగే రోజులొస్తాయేమో! ఏమో...అయినా కార్లున్న వాళ్ళకు అంత పొగరుబోతు గుణం పనికిరాదు. ఇందాక వాళ్ళె లాగ నవ్వారు...వాళ్ళకు జాలేలేదు. ఈ జాలి లేనివాళ్ళను ఏమిచేసినా పాపంలేదు. ఇంతకీ ఆ కారు నెంబరు 666 కదూ...చెప్తాను. ఎప్పటికైనా ఆ పిల్లల పని నేను పట్టకపోతే చూడు... ఎంతగర్వం...ఎంత పొగరు. మాకే కారు ఉంది కదా అని విరగబడిపోతున్నారు. ఛీ...ఇలాంటి వాళ్ళ కసలు ఎవ్వరూ ఎందుకు బుద్ధి చెప్పరో... పైగా చూడు ఆ మూక అంతా...ఏం చావాలని ఉందేమిటబ్బాయ్...అని నన్నే మందలిస్తున్నారు. అంతేలే...అందరూ ధనవంతుల తరుఫే! పేద వాళ్ళతరఫున మాట్లాడే వాళ్లొక్కరూ ఉండరు. పోనిద్దూ ఎవరెలాపోతే మనకేం...టైమయింది. ఇప్పటికే ఏడుస్తూ వుంటాడు. భోజనం ఎంతసేపు చేస్తావేమిటని విరుచుకపడతాడు. అతనుమాత్రం హాయిగాతిని, కాస్సేపు నిద్రపోయిగాని కొట్టు మీదికి రాడు. అతనికేం మహారాజు! ఏనాడో పెట్టిపుట్టాడు. మనకలా ఎలా కుదురుతుంది..." అనుకుంటూ రమణమూర్తి కొట్టుదగ్గరకు గబగబా నడచి వెళ్ళిపోయాడు.

షావుకారు అతనికి కొట్టు అప్పజెప్పి భోజనం చేసి ఓ కునుకుతీసి తీరిగ్గా నాలుగింటికి షాపుకొచ్చాడు.

అప్పటివరకూ కొట్టును జాగ్రత్తగా ఇంకా ఇద్దరికుర్రాళ్ళతో కలిసి కాపలాకాస్తూ కూర్చున్న రమణమూర్తి షావుకారుగార్ని, మల్లెపూవుల్లాంటి దుస్తుల్లో శుభ్రంగా తయారై వస్తూన్న ఆ విగ్రహాన్ని ముచ్చటగాచూసి, 'మనకెక్కడ కుదురుతుందిలే అలాంటిబట్టలు కట్టడానికి' అనుకొని, ఏమిటేమిటో ఆలోచిస్తూ బట్టలు కొనుక్కోడానికి వచ్చినవాళ్ళకు గజం బద్దతో షావుకారుగారు తరిఫీదు చేసినదానికి భిన్నం రాకుండా మెల్లిగా కొలిచి కావలసిన గుడ్డలు ఇస్తున్నాడు. పాపం, గజంబద్ద మధ్యమధ్య చేతిపట్టు తప్పి జారిపోతూనే ఉంది. గుండె నీరసంగా మూలుగుతూనే ఉంది. కూరనారలేక ఇంటి దగ్గర భోజనం తిన బుద్ధేసింది కాదు. వట్టి చప్పిడి మెతుకులు కతకడానికి ఎట్లా యిష్టమౌతుంది? అందులో తమ్ముడు ఇంట్లో దాచిన రూపాయి ఎత్తుకుపోయాడని తెలియగానే, అన్నం అసలు సహించలేదు. 'చావండి...' అంటూ తను విసుగ్గా ఇంట్లోంచి బయట కొచ్చేశాడు. వాడు కనబడితే తవ్వి పాతెయ్యకపోతే చూడు...నేను రమణమూర్తినేకాదు...అన్నాడు. తీరా వీధిలో కొస్తే వెధవది కారు గండం...చీమువాసి తప్పి పోయింది. కాని లేకపోతేనా అమ్మో ఇంకేముంది. పచ్చడి పచ్చడి అయిపోయి ఉండేవాడు. ఏదో భగవంతుడి దయ ఉండబట్టి కాని, లేకపోతే ఏముంది...అమ్మను ఎవరు చూసేవారు... ఈ తమ్ముడా...వట్టిదొంగ! వాడు చూడకేం... వాడి మొహం...' అనుకుంటూ రమణమూర్తి పని చేసుకపోతున్నాడు.

అప్పుడే సరిగ్గా అదేకారు—666 నెంబరు గల కారు—ఆ కొట్టుముందు ఆగింది. రమణమూర్తి ఆ కారును చూడగానే ఏమిటో మనసులో గజగజ లాడిపోయాడు. అబ్బ! అందులోంచి ఆ కారులోంచి ఎంత అందమైన అమ్మాయిలు దిగారు...ఇద్దరూ ఒక్కలాగే ఉన్నారు. ఒకరిని చూస్తే ఒకరిని పోల్చడం కష్టం...ఈ అమ్మాయి అలంకరణ లేమిటో ఆ అమ్మాయివీ అవే...ఆ అమ్మాయి ఎంత పొడుగో ఈ అమ్మాయి అంతే... ఇద్దరూ ఒకేసారి మెట్లు ఎక్కుతున్నారు; రత్న కంబళ్ళు ఆ కాళ్ళక్రింద పరిస్తే ఎంత బాగుండును!"

అద్దాల్లోని సువర్ణాభరణాల్లా ఆ జిలుగు చీరల్లో ఆ సుకుమారపు శరీరాలు...అవే మోయలేని ఆ నడకల్లోని విరహాలు కల్చరుకు మారుపేరైన వ్యవహారాలు కాబోలు! ఏమి అందం ఏమి అందం!

రమణమూర్తి వాళ్ళవైపు అలాగే చూస్తూ కలల్లోకి కూలిపోయాడు. 'వాళ్ళ కారు క్రింద ఎందుకు పడిపోలేదు...ఎందుకు పడిపోలేదు... అబ్బ! ఎంత చక్కగా ఉన్నారు! ఏమో అందులో ఒక అమ్మాయి జాలిపడి నిజంగా తనను పెళ్ళి చేసుకునేదేమో! ఇక తనకు 'అమ్మ' పెళ్ళి చెయ్యడం ఉత్తది. తనకిక పెళ్ళికాదు. అంతే అనుకుంటున్నాడు.

ఇంతలో ప్రళయంలా షావుకారు కేక వినిపించింది. కంగారుపడి పోయాడు హడలిపోయాడు. ఊడిపోయిన ప్రాణాల్ని ఎట్లాగో అతుక్కున్నాడు. "ఏమిటలా చూస్తావు వెళ్ళి లోపలిగదిలో బీరువాలోని సిల్కు చీరలు తీసుకరా..." వినబడటమే తడవుగా గబగబా మెషీన్‌లా రమణమూర్తి పరుగెత్తాడు. పరుగెత్తి ఇన్ని చీరలు తీసుకొచ్చాడు. షావుకారు రౌద్రంగా అఱచాడు. కారుక్రింద పడినా బాగుండును. కారుకన్నా రౌద్రంగాఉంది ఆ అరుపు: 'మతిపోయిందా ఏం...నేను ఏం తెమ్మన్నాను నువ్వేం తెచ్చావ్...' అన్నాడు షావుకారు. ఆ డ్రైవరు కళ్ళుకూడా ఇందాక ఇంత ఎర్రగాలేవు. రమణమూర్తి ఉక్కిరి బిక్కిరై పోయాడు. ఏవి తేవాలో తెలియలేదు. ఏవితెస్తే పనికి రావో అర్థంకాలేదు. పరుగెత్తాలో తెలియలేదు. పరుగెత్త గూడదో తెలియలేదు. అప్పుడే అతన్ని చూసి ఆ అందకత్తెలిద్దరూ, (అనుకున్నట్లుగా) ఒకేసారి ఫక్కున నవ్వారు. ఇందాకటికన్న చురుగ్గా నవ్వేరు. వట్టి విషపునవ్వు! భయం బాధ సిగ్గు...రమణమూర్తిని త్రొక్కేశాయి. వాటి అట్టడుగునుంచి అతను ఊబిలో దిగపడిపోయిన వాడిలా బాడి, బురదతో తల ఎత్తాడు. పులుకు పులుకున వాళ్ళవైపు చూశాడు.

'ఇతనేనే...ఇందాక మన కారుక్రింద పడవలసినవాడు.' ఫక్కున నవ్వింది ఆ అమ్మాయి. అంతటితో ఊరుకోలేదు. 'ఔను...ఈ చిరుగుల చొక్కా...ఈ మొహం...ఇతనే... ఏమండీ షావుకారుగారూ! ఇంత మఠిమురుపు మనిషిని పెట్టుకున్నారేం మీ కొట్లో?" అని ఇంకా ఏమిటో పేలుతూనే ఉంది.

రమణమూర్తి లోపలిగదిలోకి పారిపోయాడు. లోపలిగదిలో ఏడ్చాడు. లేదు లేదు, ఏడ్వటానికి కూడా అతనికి వ్యవధి లేదు. కాని, 'ఇలాంటి పెళ్ళాం నాకు ఏ జన్మకీ వద్దు భగవంతుడా!' అని మాత్రం అతను అప్పుడు తప్పకుండా అనుకొని ఉంటాడు. అంతే మరి పాపం!

---

ఇండియాలోని పారిశ్రామిక మేనేజర్ల భవిష్యత్ శిక్షణ విషయంలో భారత ప్రభుత్వానికి సలహా ఇవ్వటానికై కల్నల్ లిండాల్ ఎఫ్. ఉర్విక్ అనే ప్రముఖ బ్రిటిష్ మానేజిమెంటు నిపుణుడు ఫిబ్రవరి 10న ఢిల్లీ వచ్చారు. ఈయన ఆరు వారాలపాటు ఇండియాలో ఉండి, బొంబాయి, కలకత్తా, మద్రాసువంటి ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రాలలో ప్రభుత్వ ప్రతినిధులతోను, పరిశ్రమల ప్రతినిధులతోను, విద్యాప్రతినిధులతోను, సంప్రదింపులు జరుపుతారు. ఇప్పటి పారిశ్రామిక మేనేజర్ల, భవిష్యత్ పారిశ్రామిక మేనేజర్ల, శిక్షణ విషయంలో, ఇండియా మానేజిమెంటు స్టడీస్ బోర్డు, హోంశాఖ, ఇండియా మానేజిమెంటు ఇన్‌స్టిట్యూట్టుల ప్రణాళికలమీద వాటికి సలహా ఇవ్వవలసిందిగా భారతప్రభుత్వం ఉర్విక్ గారిని కోరియున్నది.